


పడమటి కొండలపై మొలచిన అరుణా కాంతులను చీకటి రాక్షసి మింగివేయ సాగింది.

చీకటి. యింకా ఐదు నిమిషాలలో వెలుగు అంతరించి చీకటి రాజ్య మేల బోతూంది. చీకటి...చీకటి. ఐదే ఐదు నిమిషాలు. చీకటితోపాటే ఆమె వస్తుంది. చీకటి పడుతూందని ఎంత గ్యారంటో ఆమె వస్తుందని అంత నమ్మకంగా చెప్పవచ్చు.

చీకటి పడింది. వీధి దీపాలు వెలిగాయి. ఆమె వచ్చింది. వచ్చి ప్రక్కన నిలబడింది. ఒంటరిగా, ప్రశాంతంగా నిలబడి కొళాయి దగ్గర జరుగుతున్న కోలాహలాన్ని వీక్షిస్తూంది తనకేమీ సంబంధం లేనట్టుగా.


ఆ వీధి అంతటికి అదొక్కటే కొళాయి. ఆ వీధిలోనున్న కుటుంబా లకు ఆ కొళాయి ఒక జీవనగంగ. ఉదయం మూడు గంటలు, సాయంత్రం రెండు గంటలు. కొత్త సినిమా రిలీజు అయినంత సందడి వుంటుందక్కడ. పిల్లలు ఒక ప్రక్క, పురుషులు ఒక వైపు, స్త్రీలు మరోవైపు నిలబడతారు, ఓపిక నశించేవరకు. కొంతసేపు గుమికూడి విడిపోతారు. చీకటిపడు తుందనగానే నేను ముందు నేను ముందు అని బలాబలాలు తేల్చుకుంటారు. ఈ లోగా చీకటిపడిపోతుంది. సందడి తగ్గి ప్రశాంత వాతావరణము చోటు చేసుకుంటుంది మళ్ళీ ఉదయంవరకు.

అక్కడ అంత సందడిగావున్నా, అంత కోలాహలం జరుగుతున్నా, అంత అలజడి చెలరేగుతున్నా ఆమె మాత్రం ఏకాగ్రతతో అంతా గమనిస్తూనే వుంటుంది. ఏమీ మాట్లాడదు. యెవ్వరి తోను మాట్లాడదు. ఆమెలో ఎలాంటి ఆతురతా అగుపించదు తిరిగి ఇంటికి వెళ్ళిపోవాలని. యితరు లెవరూ ఆమెను పట్టించుకోరుకూడ. అందరూ వెళ్ళి పోయేవరకు నిలబడే వుంటుంది. అల జడి ఆగిపోయి ప్రశాంతత నెలకొనే వరకు ముందుకు కదలదు. నీళ్ళు పట్టు కోదు.

ఆమె అలాగే నిలబడివుంది. ఒక్కొక్కరూ నీళ్లు పట్టుకొని తొందర తొందరగా వెళ్ళిపోతున్నారు. మళ్ళీ వచ్చేందుకేమో! ఆమె మాత్రం కదలడంలేదు. ప్రతిమలా నిల బడింది. ఒక్కొక్కరు వెళుతున్న వైపు తీక్షణంగా చూస్తుంది, 'ఈ మను షులకు యింత తొంద రెందుకో?' అన్నట్టుగా

రెండడుగులు ముందుకు వేసింది. అప్పటికే చాలామంది వెళ్ళిపోయారు. చిన్న చిన్న మాటలు తప్ప పెద్ద సందడి ఏదీలేదు. యిద్దరు పిల్లలు పట్టుకుంటుండగా ఆమె వచ్చి నీళ్ళు పట్టుకొని తిరుగుముఖం పట్టింది. ఆమె అటు వెళ్ళడంతో నేను లోపలికి నడి చాను. రోజూ కొళాయి దగ్గర జరుగు తున్న సందడిని చూడడం నాకు దిన చర్య అయింది.

నేను యిక్కడకు బదిలీ అయివచ్చి పదిరోజులు అవుతుంది. కొత్త ప్రదేశం, కొత్త వాతావరణం, కొత్త కొత్త మనుషుల మధ్య వింత అనుభూతి కల్గింది. రోజూ చీకటిపడేవేళ కొళాయి దగ్గర జరిగే సందడి చూస్తూ నిలబడడం ఒక సరదాగా మారింది, ముఖ్యంగా ఆమెను చూడడం. నా గది ముందు నిలబడితే కొళాయి దగ్గర ఏమి జరిగేదీ కనిపిస్తూంటుంది. చీకటి పడడం ఆమె రావడం రెండూ ఒకేసారి జరుగుతుంటాయి. "చీకటి ఎప్పుడు పడుతుందా, ఆమె ఎప్పుడు వస్తుందా,




అని నేను ఎదురుస్తూచూ నిలబడ తాను.

ఆమె చాల అందంగా వుంటుంది. ప్రతి ఒక్కరిని యిట్టే ఆకర్షించగలదు. ఆమె మెడలో ఎలాంటి ఆభరణం కనిపించదు. జడలో పూలుండవు. అయినా, అందంగా కనిపించడం ఆమెలోని ప్రత్యేకతని నేను చెప్పనవసరం లేదు. ఆమెను చూసిన ప్రతి ఒక్కరు ఒప్పుకొని తీరవలసిందే 'ఆమె అందంగా వుంటుంద'ని.

ఆమెను నేను రోజూ చూస్తూనే వున్నాను. కాని ఆమె మాత్రం ఒక్కసారయినా నావైపు చూడలేదు. ఒక్క నావైపేమిటి ఆమె యెవ్వరినీ చూడదు. ఆమె నావైపు చూడాలని నేను ఎన్నోసార్లు ప్రయత్నం చేశాను. లాభం లేకపోయింది.

ఆమె నావైపు చూడాలని నేను చేసే ప్రయత్నాలు విఫలంకావడంతో యింకా ఎక్కువ ప్రయత్నం చేయాలని నాలో దృఢ సంకల్పం కల్గింది. ఆమె నా వైపు చూడాలి. నాతో మాట్లాడాలి, నవ్వాలి. నాతో నడిచి రావాలి. నేను ఆమెతో కలిసి నడుస్తూ మాట్లాడాలి. యివన్నీ తీరాలంటే ఆమె ఎవ్వరో ముందు తెలుసుకోవాలి. ఎక్కడ వుంటుందో ఆరాతీయాలి. తలిదండ్రులు ఏంచేస్తుంటారో కనుగొనాలి. మొదట ఏంచేయాలి ? ఎవ్వరిని అడగాలి? పెద్ద వాళ్ళను అడిగితే అనుమానపడతారు. చిన్నపిల్లలను అడగడం భావ్యంకాదు. మరి ఎట్టా? ఐడియా! సూటిగా వెళ్ళి ఆమెనే పలుకరిస్తే! అమ్మో, చెంప చెళ్ళుమనిపించదూ! పోనీ ఉత్తరం వ్రాస్తే అనుమానంతో చించి పారే

స్తూంది. మరి ఎట్లా? చివరకు ఉత్తరం వ్రాయడమే మంచిదని సంతోషపడ్డాను. మళ్ళీ అంతలోనే చిక్కు ప్రశ్న? ఉత్తరము ఏమని వ్రాయాలి? ఎలా మొదలుపెట్టాలి ? ఆమె పేరు కూడా తెలియదు. గజిబిజిగా తిరుగుతున్న ఆలోచనలను కట్టిపెట్టి ఏదో ఒకటి రాత్రికి బాగా ఆలోచించి వ్రాయాలని గట్టిగా నిర్ణయం చేసుకున్నాను పట్టు విడవని విక్రమార్కునిలా. లోపలికి నడిచి తలుపులు బిగించాను.

ఉత్తరం రాయాటానికి ఉపక్రమించాను. ఏదైనా రాయామనికి చేతులు రాలేదు. యిప్పటివరకు ఆలోచించిన ఒక్క ఆలోచనా అక్షరరూపం తాల్చక పోయేసరికి నామీద నాకే కోపంవచ్చింది. పరిపరి విధాల ఆలోచించాను. కొన్ని పాత ఉత్తరాలను తిరిగి చదివాను. నాలుగు సిగరెట్లు కాల్చినా లాభం లేక పోయింది. ఆమె పేరే తెలియదు. ఉత్తరం మొదలుపెట్టడం ఎలా ? నవ్వొచ్చింది. పేరు లేకపోతేనేం, ప్రేమతో ఎలా పిలిచినా బాగానే వుంటుంది. ప్రారంభించాను.

"సోదరీ!


నేను యిక్కడకు కొత్తగా వచ్చాను. వచ్చి నెల రోజులవుతుంది. యిక్కడి వాతావరణం, యిక్కడి మనుషులు నాకెంతగానో నచ్చారు. ముఖ్యంగా కొళాయిదగ్గర రోజూ జరుగుతున్న పోరాటం నేను జీవితంలో మరచిపోని పానిపట్టు యుద్ధం వంటిది. చూస్తూ వుంటే గంటలు క్షణాల్లా గడిచిపోతున్నాయి. నేను వుంటున్నది ఆ కొళాయి దగ్గర్లోనే. రోజూ చీకటిపడడం నీవు రావడం ఒకేసారి జరుగుతుంటుంది. నీవు వచ్చి ఒంటరిగా, ఎవ్వరితోనూ మాట్లాడకుండా నిలబడటం నాకు ఎంతగానో నచ్చింది. అందుకే నీవంటే నాకు ప్రేమ ఏర్పడింది. నీతో మాట్లాడాలని, నీతో కలసి నవ్వుతూ, చనిపోయిన నా చెల్లెల్ని మరచిపోవాలని ఊహించుకుంటున్నాను. నా యీ కోరిక పెద్దదికాదు, తీరనిది కాదు. ఈ ఉత్తరం చూసిన మరుసటిరోజు బడి దగ్గర కలువగలవు. ఎప్పుడు చీకటి పడుతుందో, ఎప్పుడు నీతో మాట్లాడుతానోనని వేయి కళ్ళతో ఎదురు చూస్తాను.........

శాంతారాం.'

ఉత్తరం పొందికగా వ్రాసి టేబిల్ మీద పెట్టి కళ్ళు మూసుకున్నాను, తొందరగా తెల్లవారి మరల చీకటిపడాలనుకుంటూ.

సాయంత్రం కావస్తూంది. మెల్ల మెల్లగా అరుణాకాంతులు పోయి చీకటి ఛాయలు పరుచుకుంటున్నాయి.

చీకటిపడుతూంది. ఆమె వచ్చే వేళయింది. ఉత్తరం ఎవరితో అందించాలి? స్వతహాగా నేనే వెళ్ళి యిస్తే




తిరస్కరించవచ్చు అపరిచితవ్యక్తి వని. పైగా ఆ వీధికి కొత్తవాడిని. ఎవరైనా చూసినా బాగుండదు. ఒక కుర్రవాడిని పట్టుకుని బిస్కట్టో చాక్‌లెట్టో కొని యిస్తానని ఆశ చూపించి పని చేయించుకోవాలనుకున్నాను.

కొళాయిదగ్గర సందడి తగ్గింది, ఒక్కొక్కరు వెళ్ళిపోతున్నారు. ఆమె మాత్రం నిలబడే వుంది. కొళాయి దాటి వెళ్ళిన నేను నాలుగువైపులా చూశాను ఎవరైనా కుర్రాడు దొరుకుతాడేమోనని. ఎదురుగా లైటుదగ్గర నలుగురు పిల్లలు ఏదో ఆట ఆడుతూ కుస్తీలు పడుతూంటే నేను అక్కడికి వెళ్ళడంతో గప్‌చిప్‌గా వుండిపోయారు. ఆ నలుగురిలో అందరికన్నా చిన్నవానిడి పిలిచి పక్కకు తీసుకు వెళ్ళాను.

"బాబూ, నీ పేరు?" అడిగాను.

"రంగారావు." ధైర్యంగా చెప్పాడు.

"నీకో పని చెబుతాను చేస్తావా?" అని అడిగాను.

"ఓ, తప్పకుండా." ఏ పనైనా ధైర్యంగా చేస్తాననే ధీమా వుంది ఆ కుర్రవానిలో.

"ఈ అర్ధరూపాయి జేబులో వుంచు. ఈ ఉత్తరం జాగ్రత్తగా పట్టుకెళ్ళి, అదిగో అటువైపునుండి ఇటువైపు వస్తూంది, ఆమె కందించు. పో, వెళ్ళు." చెప్పి వెనుదిరిగాను అక్కడ వుండడం మంచిది కాదని.

"సార్......సార్ ఆమె మా అక్కయ్య. కళ్ళు కనుపించవు." ఆ కుర్రవాని మాటలు విని బెల్లంకొట్టిన రాయిలా నిలబడిపోయాను. ఆలోచనలు ఆగిపోయినవి. రక్తప్రసరణ స్థంభించిపోయింది. చెమట బిందువులు జారుతూవుంటే తడబడుతున్న అడుగులతో ముందుకు నడిచాను.